# ఒకనాటి కవితావైభవం
## - సంధ్య యెల్లాప్రగడ



**-4-**

# కృష్ణరాయుని ఆముక్తమాల్యద

పదహారవ శతాబ్ది మొదటి భాగము తెలుగువారికి సువర్ణయుగము. ఎందుకంటే, రాజాధిరాజ రాజపరమేశ్వర వీర ప్రతాప శ్రీకృష్ణరాయలు తెలుగులను, తెలుగు సాహిత్యాన్ని ఏలుటకు దిగివచ్చారు. తెలుగు సాహిత్యము, ఆ మాటకోస్తే ప్రపంచములో ఏ సాహిత్యమైనా రాజుల ఆశ్రయాముతో పెరిగింది. ఉత్తమోత్తమ గ్రంథాలను రాజులు ఆదరించారు.

కృష్ణదేవరాయులు 1487 ఫిబ్రవరిలో జన్మించాడు. తండ్రి నరసరాయునకు కృష్ణదేవరాయలు రెండవ కుమారుడు. తల్లి నాగాంబకు తొలి చూలైనా, తండ్రికి ఆమె రెండవ భార్య. రాయలు చిన్నతనము చంద్రగిరిలో గడిచినది. ఆయనకు చిన్నతనము నుంచే సంగీతమన్నా, సాహిత్యమన్నా అభిమానము. ఆయనకు వివిధ భాషలలో వున్న జ్ఞానము, సాహిత్యముపై వున్న మక్కువకు, ఆయనను "కర్ణకుండల రసాఖండ కవికావ్య" అని పెద్దన్నగారు మనుచరిత్రలో సంబోధించారు అంటే, రాయలు సాహిత్యపిపాస మనకు అర్థమవుతుంది.

1490లో సాళువ నరసరాయలు మరణించిన తరువాత రాజ్యభారము పెద్ద కుమారుడు వీరనరసింహనాయకునిపై బడింది. ఆయన తమ్ముని ప్రేమగా చూచుకునేవాడు. తను, తన తమ్ముడూ రామలక్ష్మణుల వంటివారని వీరనరసింహరాయలు ఒక శాసనములో రాయించాడు కూడా.(కంచి కామకోటి పీఠాధిపతుల వద్ద నున్న తామ్ర శాసనము).

"తిప్పాజీనాగలాదేవ్యోః కౌసల్యాశ్రీసుమిత్రయో
దేవ్యో రివ నృసింహేంద్రాత్తస్మాత్పంక్తిరథా దిన
వీరౌ వినయినౌ రామలక్ష్మణా వివ నందనౌ
జాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయ మహీపతి।"

తన తమ్ముడు వినయ సంపన్నుడని, మహీపతి యని వీరనరసింహరాయలు చెప్పాడు.

కృష్ణరాయలు విజయనగరము వచ్చి వివిధ సైనిక విద్యలలో నైపుణ్యము సాధించాడు. ఆయన "వాజ్యారోహణ నైపుణీనకులుడని" ముక్కు తిమ్మన పారిజాతాపహరణములో చెబుతాడు. 'అవల్గత్తురగ బహు విధారోహ కళారేవంతుడు' అశ్వహృదయాన్ని బాగా అర్థము చేసుకున్నవాడుట. అలా వివిధ రంగాలలో నైపుణ్యము, వివిధ బాషలలో నైపుణ్యము రాయలు వారిని ప్రత్యేకంగా తీర్చిదిద్దాయి.

కృష్ణదేవరాయలుకు శ్రీరంగపట్టణము పాలించే చామరాయల కుమార్తె తిరుమలదేవితో వివాహము జరిగింది.

వీరనరసింహరాయలు మరణము తరువాత నాటకీయముగా కృష్ణరాయలు గద్దె కెక్కటము వంటి రాజకీయ విషయాల తదనంతరము, మూర్ధాభిషేకము తరువాత బహమనీల మీద గెలుపు సాధించాడు. శివ సముద్రము మొదలగు సామంతులను అదుపులో పెట్టాడు. తరువాత తిరుపతి వెంకన్న దర్శనం చేసుకొని కళింగ మీద దిగ్విజయ యాత్రకు బయలుదేరారు. ఏడాదికి అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ మొదలలైన దుర్గాలు జయించాడు. కోటలలో వున్న స్త్రీ జనము పట్టుబడితే పుట్టింటి వారిలాగా మర్యాద చేయ్యాలని రాయలు ఫర్మానా.

గజపతుల రాజధాని కటకము మీదకు యుద్దముకు వెడుతూ విజయవాడ కనకదుర్గ దర్శనము చేసుకొని, ఏకాదశి నాడు ఉపవాసమున్నాడు. ఆరాత్రి ఆయనకు ఒక కల వచ్చింది. కలలో శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువు కలలో కనిపించి, ఒక పుస్తకము వ్రాయమని అడిగాడు. “కన్నడరాయడా, నేను తెలుగు రాయుణ్ణి. నా కథను తెలుగులో చెప్పు” అన్నాడు. తెలుగులోనే ఎందుకు చెప్పమన్నాడు అంటే, “దేశం తెలుగు, నేను తెలుగు వల్లభుణ్ణి. తెలుగు కలకండలా తియ్యగా వుంటుంది. వివిధ భాషలు మాట్లాడే నీకు దేశభాషలందు తెలుగు లెస్స” అని తెలియదా! అన్నాడు. ఆంధ్ర మహావిష్ణువు తనతో కలలో చెప్పిన మాటలు కృష్ణరాయలు ఇలా గ్రంధస్తము చేశాడు.

“ తెలుగదేల యన్న దేశంబు తెలుగేను -
దెలుగు వల్లభుండుదెలు గొకండ
యెల్లనృపులుగొవ నెరుగవే బాసాడి
దేశభాషలందు దెలుగు లెస్స”॥ (ఆముక్త. 1-15)

ఆంధ్ర మహా విష్ణువు అడిగిన కథ శ్రీరంగములో రంగమన్నారు స్వామి ఒక చిన్నదాన్ని పెండ్లి చేసుకోవటము. ఆ పిల్ల పేరు గోదా దేవి. తన జడలో ముడిచిన పూల దండను తీసి స్వామి కైంకర్యానికి ఇచ్చేది. ఆమె చూడికుడిత నాంచారి. “చూడికుడిత్త నాచ్చియార్” అంటే ముడిచి ఇచ్చిన మగువ అని అర్థము. కృష్ణరాయలు తన గ్రంథానికి “ఆముక్తమాల్యదా” అని పేరు పెట్టారు. అతి ప్రౌఢకావ్యమైన దీనినే “విష్ణుచిత్తీయము” అనికూడా అంటారు. ఈ గ్రంథము పేరులోనే ఆ వైశిష్ట్యము కనపడుతుంది. ప్రపంచ వాఙ్మయములో మరెక్కడా ఇట్టి నామకరణము కనపడదు. ఆముక్తమాల్యద అంటే “ఏ మును దాల్చిన మాల్యమిచ్చు నప్పిన్నది” అన్న శ్రీ మహావిష్ణువు మాటను బట్టి ఈ అర్థములో, ఆమె పరిభుక్తమై ఆముక్తమైన మాల్యమును రంగభర్త కిచ్చినది అని అనుకోవలెను. ఆంధ్ర పంచ కావ్యములని ప్రసిద్ధములైన వాటిలో ఇది ఒకటి.

ఆముక్తమాల్యద శృంగార ప్రబంధం కాదు. దీన్లో వీరభక్తి, వైరాగ్యాలదే ముఖ్య స్థానం. రాయలు ఈ గ్రంథము ఏడు అశ్వాసాలలో 878 గద్యపద్యాలలో వ్రాశారు. ఇందులో ‘అన్నము కన్నా అధరువులెక్కువ’లా వర్ణనలు ఎక్కువ. విస్తారమైన వర్ణనలు, అందునా ముఖ్యముగా పట్టణపు వర్ణన, ఋతువుల వర్ణన, రాజనీతి వివరణా, మత, వేదాంత బోధ వుంటాయి. రాజనీతి విషయాలు ఆముక్తమాల్యదలో తప్ప మనకు ఏ ఇతర గ్రంథాలలో కనపడవు. పట్టణ వర్ణనలు గాని ఋతువుల వర్ణనలు గాని చేసేప్పుడు రాయలు మనుషుల జీవన చిత్రణను వివరముగా చిత్రీకరించాడు. ఉదాహరణకు, విష్ణుచిత్తుని గృహ వర్ణన వైష్ణవుల సంసారమును కళ్ళ ముందు నిలుపుతారు.

“గగనము నీటి బుగ్గ కెనగా జడిపట్టిన నాళ్ళు భార్య క
న్నొగ సొరకుండ నారికెడపుంబొరియ ల్లవులించి వండ స

య్యగపల ముంచి పెట్టి గలమాన్నము నొల్చిన ప్రప్పు నాలుగే
న్పొగిపిన కూరలు న్వడియము ల్వరుగు ల్వెరుగు న్ఘృతప్లుతిన్॥"

ముసురు రోజు పొయ్యి మండక ఇల్లాలు కళ్ళు మండును. తన భార్యకు కష్టము కలగకుండా విష్ణుచిత్తుడు కొబ్బరిబొండాములు దాచేవాడు. ఇటు వంటి వర్ణనలు రాయలు ఎక్కడ చూచాడో అని అనుమానము కలుగుతుంది. ఆయన మారు వేషములో రాజ్యములో తిరిగి ప్రజలను పరిశీలనము చేసేవారట. అలా రాయలు చూచిన విషయమును తన గ్రంథములో వర్ణించాడు.

విలిబుత్తూరు నగరం, దాని విశాలమైన భవనాల వర్ణనతో గ్రంథము మొదలగుతుంది. విష్ణుచిత్తుడనే మహాభక్తుడు ఆవూరి భాగవతుల్లో ఉత్తముడు. శ్రీహరినెప్పుడూ తన హృదయంలో ధ్యానిస్తుంటాడతను. ఆ కృష్ణస్వామికి పూలదండలు కట్టి కైంకర్యం చెయ్యటం అతని మనసుకి నచ్చిన పని. న్యాయంగా సంపాయించిన డబ్బుతో ఆ వూరి గుండా వెళ్ళే తీర్థయాత్రికులకి అన్నదానాలు చేస్తుంటాడతను.

" ఆతిథ్యము గొని, హరి తన
చేతోగతి నొలయ, రంతు సేయని విద్వద్
వ్రాతంబు చూచి "లాతుల
మా తరవా యుడుగ? మాటలాడుం" డనుచున్॥"

చలికాలంలో వేడివేడి రాజనాల వరి అన్నం వుంటుంది. మిరియాల పొడులు. చుయ్యిమని శబ్దాలు చేస్తున్న కూరలు. ముక్కుజలుబు వదలగొట్టే ఆవబెట్టిన పచ్చళ్ళు, పాయసం, ఊరగాయలు, చెయ్యి చురుక్కనే నెయ్యి, బాగా కాచిన పాలు. శనివారాల్లో ఎంతోమంది పరదేశ వైష్ణవులు అతనికి అతిథులుగా ఉంటారు. వాళ్ళు భోజనానికి ముందు అరిచేతుల్లో ఇప్పపిండి ముద్దని పెట్టుకుని దానిమీద అరిటిపూవు దొప్పలో నిండా నూనె పోసుకుని ఒక తాటి చివర ఉతికిన గుడ్డల్నుంచుకుని ఏటికి పోయి తలస్నానాలు చేసి వస్తుంటారు. అర్థరాత్రి వేళైనా సరే అతనింట్లో విష్ణువు పుణ్యకథాకీర్తనం, ద్రావిడవేదాల పారాయణంతో పాటు "కూరలెక్కువగా లేవు, ఉన్నవీ చల్లబడిపోయినయ్, పిండివంటలు నిండుకున్నయ్, అన్నం కూడ అంత సుష్టుగా లేదు, ఎలాగోలా దయచేసి సర్దుకోండి" అనే మాటలు వినిపిస్తుంటయి!

ఆ కాలంలో పాండ్యమండలానికి రాజధాని మధుర. ఆ వూరి సౌభాగ్యానికి, సౌందర్యానికి ముగ్ధులై
సూర్యచంద్రులు కూడా ఎప్పుడూ ఆవూరి చుట్టూనే తిరుగుతూ ఉంటారు! అక్కడి ప్రజలు శూరులు, విలాసులు.
అంగళ్లలో నవరత్నాల్ని రాసులు పోసి అమ్ముతుంటారు. గొప్ప ఉద్యానవనాలు. వాటిలో శ్రావ్యంగా
పాడే రకరకాల పక్షులు. మందంగా వీస్తున్న మలయమారుతాలు. (ఇది విజయ నగరు పోలికలు చూపాడు రాయలు)
ఆ మండలానికి రాజు మత్స్యధ్వజుడు. చంద్రవంశభూషణుడు. సార్వభౌముడిక్కావలసిన అన్ని గుణాలూ ఉన్నవాడు. ఎప్పుడూ నీతి తప్పడు. పరాక్రమవంతుడు. మహాదాత. మధుర దగ్గర్లో వున్న అళఘరి సుందరబాహుస్వామి తెప్పతిరునాళ్ళు వచ్చాయి. పరదేశి బ్రాహ్మడొకడు ఆ తిరునాళ్ళకి వచ్చి రాజపురోహితుడి యింట్లో విడిదిచేసేడు. తిరునాళ్ళు చూసి, అతని ఆతిథ్యంలో చక్కటి భోజనం చేసి, తన వూరికి ప్రయాణమయ్యేడు. రాత్రయింది. దార్లో మధురలో ఓ అరుగు మీద మిగిలిన బాటసారుల్తో కలిసి విశ్రాంతికి సంచి తలగడగా పెట్టుకు పడుకున్నాడు. కాలక్షేపానికి సుభాషితాలు పాడటం మొదలెట్టేడు.

సరిగ్గా అదే సమయంలో మత్స్యధ్వజ మహారాజు తన భోగిని దగ్గరికి బయల్దేరాడు. అప్పుడతనికో సుభాషితం వినిపించిందిలా ....“వర్షాకాలానికి కావలసిన వాటిని మిగిలిన నెలల్లో కూడగడతాం. రాత్రికి కావలసింది పగలు. ముసలితనానికి కావలసింది యవ్వనంలో. అలాగే పరలోకానికి కావలసింది కూడ యీ లోకంలోనే సమకూర్చుకోవాలి”. పిడుగుల్లా తగిలేయా మాటలు రాజుకు. తన స్థితిని తల్చుకునే సరికి దుఃఖం వచ్చింది. చక్రవర్తుల్నీ మహాపురుషుల్నీ కూడా ఏట్లో నావలా కదిలీ కదల్నట్టు కదిలి కాలం ఎలా మోసం చేసిందో ఆలోచించుకున్నాడు.

మెరుపులాటి క్షణికమైన రాజభోగాల గురించి కాక శాశ్వతమైన సత్యం గురించి విచారించాలనుకున్నాడు. వెనక్కి తిరిగి యింటికి వెళ్ళేడు. ఉదయాన్నే కొలువు తీరి విద్వాంసులందర్నీ పిలిపించేడు. శాస్త్రాలన్నీ చూసి మోక్షం వచ్చే మార్గం ఏమిటో కనుక్కుని చెప్పమన్నాడు.

ఇక్కడ విష్ణుచిత్తుడు ఎప్పట్లాగే మూలమంత్రం జపిస్తూ తులసిమాలను మన్నారు స్వామికి సమర్పించబోయేంతలో ఆ స్వామే ప్రత్యక్షమయేడు! చిరునవ్వుతో అతనికి మత్స్యధ్వజుడి పరిస్థితి వివరించేడు. “నువ్వు వెంటనే మధురకి వెళ్ళు. అక్కడ రాజు ముందు అన్నీ తెలిసినట్టు అవాకులూ చెవాకులూ పేల్తున్న వాళ్ళ మదం దించు. నా మహిమని ప్రకటించు. పాండ్యుణ్ణి వైష్ణవుణ్ణి చేయి” అని ఆనతిచ్చేడు. వణికిపోయేడు విష్ణుచిత్తుడు. “అయ్యో స్వామీ! శాస్త్రగ్రంథాల వంకనైనా చూడని వాణ్ణి. తోటలో మట్టి తవ్వటం తప్ప నాకేం తెలియదే! నన్ను వాదానికి పంపితే అక్కడ నీకు జరిగేది అవమానమే” అని మొత్తుకున్నాడు. “నేనున్నాగా అంతా జరిపించటానికి!” అని స్వామి ధైర్యం చెప్పి పంపాడు విష్ణుచిత్తుడిని. రాజుకి ప్రసాదంగా ఇవ్వటానికి కావిళ్ళలో అరిసెలు పట్టించుకుని బయల్దేరేడు మధురకి. దార్లో తినటానికి అతని భార్య పొరివిళంగాయలు (వేపుడు బియ్యప్పిండి, బెల్లం పాకంతో చేసిన ఉండలు) కట్టి ఇచ్చింది. ప్రతిచోటా ఎసట్లో కొంచెం వెయ్యటానికి పాతవడ్లబియ్యం (కీడు కలక్కుండా వుండటానికి ఇలా చెయ్యటం ఆచారం), శుద్ధిచేసి సగం బెల్లం కలిపిన సాంబారు చింతపండు, ఎన్నో గోవుల నెయ్యి, పెరుగు వడియాలు, పచ్చి వరుగులు, పప్పులు, పూజాసామాగ్రి అతన్తో బయల్దేరేయి. మధుర చేరేడు విష్ణుచిత్తుడు. నేరుగా రాజసభకి వెళ్ళేడు. అతని దివ్యతేజం చూసి రాజుతో సహా సభంతా జంకుతో లేచి నిలబడింది. రాజు చూపించిన బంగారు ఆసనం మీద కూర్చున్నాడు. అప్పటిదాకా వాదం సాగిస్తున్న సభంతా నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఓ విద్వాంసుడి వైపు తిరిగేడు. అతని వాదం అంతా ముందు తన మాటల్లో వివరించేడు. దాన్లో ఒక్కొక్క విశేషాన్నే తీసుకుని సూక్ష్మంగా ఖండించేడు. మధ్యలో మాట్లాడబోయిన వాళ్ళని ఒక్కో మాటతోటే వారించేడు. మళ్ళీ మొదటివాడి దగ్గరికొచ్చి తన సిద్ధాంతం స్థాపించి వాణ్ణి ఒప్పించి ఓడించేడు. “సరే ఇప్పుడు చెప్పు నీ వాదం ఏమిటో” అని తర్వాతి వాణ్ణి కూడ అలాగే గెలిచేడు.
ఇలా అందర్నీ వరసగా వాదంలో సాధించేడు. బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తుల ద్వారా పరమాత్మ తత్వాన్ని నిరూపించేడు. తర్వాత నారాయణుడే ఆ పరతత్వమని బోధించేడు. సకల భూతాల్లోనూ ఉండే ఆత్మ ఆ విష్ణువే అని వివరించేడు.
ఆ విష్ణువుని పొందటానికి మార్గం చూపటానికి ఖాండిక్య కేశిధ్వజుల కథ వినిపించేడు. అలా మత్స్యధ్వజుడికి విష్ణుమహత్యం వివరించేడు విష్ణుచిత్తుడు. మూలమంత్రాన్ని ఉపదేశించి అతన్ని వైష్ణవుడిగా చేసేడు.
సభలో కట్టివున్న ముల్లెమూట దానంతటదే తెగి కిందపడింది, విష్ణుచిత్తుడి విజయాన్ని దృఢపరుస్తూ. గజారోహణం చేయించి విష్ణుచిత్తుణ్ణి ఊరేగించేడు పాండ్యుడు. ఇల్లు చేరి విష్ణుమహిమకి పరవశించి భక్తుల్ని ముందుకంటే ఎక్కువగా ఆదరిస్తూ గడుపుతున్నాడతను.

ఒకనాడు విష్ణువు శ్రీదేవితో అన్నాడిలా "ఈ విష్ణుచిత్తుడు నాకు చాలా ప్రియమైన భక్తుడు. ఇతనితో సమానంగా నాకు ప్రీతి కలిగించినవాడు ఇంకొక్కడే యామునాచార్యుడు. అతని విషయం చెప్తా విను" అంటూ యామునాచార్యుడి కథను చెబుతాడు
విష్ణువు. చిన్నతనంలోనే వేదవేదాంగాలు నేర్చుకున్నాడు యామునుడు.
ఆ కాలంలో ఇప్పటిపాండ్యరాజు పూర్వుడే ఒకడు వెర్రిశైవం ముదిరి విష్ణువుని నిరాకరించేడు. విభూది పూసుకుంటే తప్ప విష్ణుభక్తులకి ప్రవేశం లేకుండా పోయింది అతని సభలో. ఐతే ఆ రాజు భార్య పతివ్రత, విష్ణుభక్తురాలు. అన్ని రూపాలూ విష్ణువే గనక ఎవరిని పూజించినా తప్పు లేదు. ఐతే నేరుగా విష్ణువునే పూజిస్తే ఫలం ఇంకా ఎక్కువ కదా! తన భర్త వైష్ణవ నిరాదరణకి బాధపడుతోందామె. యామునుణ్ణి వాదానిక ప్రేరేపించేడు నారాయణుడు.

అతనా రాణికి కబురు పంపేడు "నాకు రాజుని కలిసే అవకాశం కలిగిస్తే అతన్ని విష్ణుభక్తుడిగా చేస్తా"నని. ఆమె రాజుతో చెప్పింది యామునుడి గురించి. అతను కొంత తటపటాయించి మర్నాడుదయాన్నే అతన్ని
పిలిపించేడు. నమస్కరించి కూర్చున్నాడు యామునుడు. ఎగాదిగా చూసి రాజు ఇలా అంటాడు...

'సంగతియె యోయి? ఇసుమంత రింగణావు!
తత్త్వ నిర్ణయ వాదంబు తరమె నీకు?
ఓడితేనియు పట్టి మొర్రో అనంగ
లింగమును కట్టకుడుగ మెరింగి నొడువు!

(చాలా గమ్మత్తయిన పదాలున్నాయిందులో. ఐతే వాటితో ఆ రాజు కంఠస్వరాన్ని ఎంతో గొప్పగా చూపిస్తున్నాడు కవి. దీని అన్వయం ఓయి, సంగతియె (సంగతేమిటో తెలుస్తోందా నీకు?), ఇసుమంత (చిన్న), రింగణావు (పొట్టిగుర్రం లాటి వాడివి "చూట్టానికి బుడతడివి" అన్నట్టు), రెండు, మూడు పాదాలు స్పష్టమే; లింగమును కట్టక, ఉడుగము (ఊరుకోము), ఎరిగి (ఇది తెలుసుకుని), నుడువు (మాట్లాడు).

వాదంలో అన్ని మతాల వాళ్ళనీ సునాయాసంగా జయించేడు యామునుడు. రాజుని వైష్ణవుణ్ణి చేసేడు. తన చిన్న చెల్లెల్ని యామునుడికిచ్చి వివాహం చేసేడా రాజు. అర్ధ రాజ్యం కూడ ఇచ్చేడు. ఆ కథ అక్కడితో ముగుస్తుంది.

విష్ణుచిత్తునికి తోటలో ఒక పాప దొరుకుతుంది. ఆమెను పెంచుకుంటాడు సంతోషముగా. ఆమె చిన్నతనము నుంచీ రంగనాథుడే తన నాథుడన్న భావముతో పెరుగుతుంది. జన్మాంతరాల బాంధవ్యం ఆమెలో విరహం రేపుతోంది. తనలో తను మాట్టాడుకుంటోంది. ఇక్కడ ఆమె విరహము విస్తారముగా వర్ణించారు రాయలు.

రోజూ స్వయంగా పూలమాలికలు రచించి గుడికి వెళ్ళి ఒంటరిగా స్వామికి సమర్పిస్తోంది. ఆయన కథల్ని దివ్యగానం చేస్తోంది. నిరంతరం స్వామినే తల్చుకుంటూ పూజిస్తూ గడుపుతోంది. అదంతా తనకి తెలియని ఓ రకమైన తపస్సు కాబోల్ననుకున్నాడు విష్ణుచిత్తుడు. ఈ విషయం ఏమిటో తెలుసుకుందామని ఓ రోజు ఆ స్వామికే ఆమె ప్రవర్తనంతా వివరించి చెప్పి సలహా అడిగేడతను!

మందహాసం చేసేడు స్వామి అదంతా విని! ముందుగా అతనికి మాలదాసరి కథని వినిపించేడు. ఇలా విష్ణువు వామనుడిగా వెలిసిన చోటికి దగ్గర్లో ఉండి రోజూ ఉదయాన్నే విష్ణువు గుడికి వెళ్ళి మంగళకైశికి రాగంలో గీతాలు పాడి వెళ్ళేవాడా దాసరి. మహా ధర్మపరుడతను. శుద్ధమైన మనసున్నవాడు. ఎండా గాలీ ఆకలీ అన్నీ మరిచిపోయి పరవశంతో రాళ్ళు కరిగించే గానం చేస్తూ భక్తి ఉద్రేకంతో నాట్యం చేసేవాడు రోజూ. ఓనాడు అర్థరాత్రివేళ ఓ ఇంట్లో పిల్లి దూరింది. దాంతో కంగారు పడి కోళ్ళు అరిచినయి. తెల్లవారుతోందని స్వామి సేవకి బయల్దేరేడు దాసరి.

దార్లో మర్లమాతంగి తీగని తొక్కేడు! ఎక్కడెక్కడో తిరిగేడు. పాడుపడ్డ బీడుల్లో తేలేడు.అంతలో ఎదురుగా కనిపించిందతనికి మహావిస్తారమైన ఓ వటవృక్షం. దానిమీదో బ్రహ్మరాక్షసుడుంటాడని జనం అనుకుంటారు. అటే నడిచేడు దాసరి. అక్కడ ఎక్కడ చూసినా మెదడంతా జుర్రేసి పడేసిన పుర్రెలు. మాంసమంతా గీరిగీరి తిన్న ఎముకలు. ముసిరిన ఈగల్తో నిండిపోయి వున్న పచ్చితోళ్ళు. గాలికెగురుతున్న మనుషుల జుట్టు. ముక్కలై పడున్న అవయవాలు. వాటికోసం పోరాడుతున్న మృగాలు. ముక్కులు పగిలే కుళ్ళుమాంసం కంపు! “ఇక్కడెవడో ఉన్నాడు. వాడు మనిషి మాత్రం కాదు” అనే అనుమానం ప్రవేశించింది దాసరి మనసులో. ఆ అనుమానం నిజం చేస్తూ ఎదురుగా ఆ చెట్టు మీద కనిపించేడతనికి కుంభజానువనే బ్రహ్మరాక్షసుడు! దాసరిని చూసేడు. నోరూరింది. ఎగిరిదూకేడతని ముందు!

రాక్షసుడు పిశాచుల్ని కేకేసేడు పట్టుకోమని. అందరూ కలిసి వెంటబడి పట్టుకున్నారతన్ని. దాసరి ధైర్యంగా బ్రహ్మరాక్షసుడితో అన్నాడు “నాకు చావు గురించి భయం లేదు. నిజానికి శిబిచక్రవర్తి లాగా నా శరీరాన్ని మరొకరి ఆకలి తీర్చటానికి ఇవ్వటం నాకు సంతోషంగా ఉంది కూడ. ఐతే నాకో వ్రతం వుంది. రోజూ ఈ దగ్గర్లో ఉన్న కురుంగుడికి పోయి అక్కడ విష్ణుభజనలు పాడి వస్తాను. ఇవేళ కూడ అలాగే చేసే అవకాశాన్ని నాకివ్వు. తిరిగొచ్చి నీకాహారాన్నౌతాను” అని.

వెకవెక నవ్వేడు రాక్షసుడు. “నీ దొంగదాసరి వేషం చూసి నీ మాటలు నమ్మమంటావా? ఒకసారి యిక్కణ్ణుంచి పోతే నువ్వు మళ్ళీ తిరిగిరావని నాకు తెలీదనుకుంటున్నావా? ఈ వెర్రిమొర్రి మాటలు చాల్లే!” అని కొట్టిపారేసేడు. “నారాయణా!” అంటూ చెవులు మూసుకున్నాడు దాసరి. ఎన్నో విధాలుగా చెప్పి చూసేడు. చివరికి ఘోరప్రతిజ్ఞ చేసేడు “ఎవనివల్ల ఈ విశ్వం పుడుతుందో, ఎవనిలో ఉంటుందో, చివరికి మళ్ళీ ఎవనిలో లీనమైపోతుందో ఆ విష్ణువుకి మరో దేవతనెవర్నో సమానంగా భావించిన పాపాన పోతాను, తిరిగి రాకుంటే” అని. అప్పటికి నమ్మకం కలిగింది రాక్షసుడికి. దాసరిని విడిచాడు. గుడికి పరుగెత్తుకెళ్ళేడు దాసరి. స్వామికి సాష్టాంగనమస్కారం చేసేడు. ఎప్పటికన్నా కూడా ఉద్రేకంతో స్తోత్రగీతాలు పాడేడు. వెంటనే ఇచ్చిన మాట ప్రకారం రాక్షసుడి దగ్గరికి తిరిగొచ్చేడు. “నాలో ఏమీ మార్పు లేదు, బాగా చూసుకో. ఇందాక ఏఏ అవయవాలు ఎలా వున్నాయో యిప్పుడూ అలాగే ఉన్నాయి. ఇంక తృప్తిగా భోంచెయ్యి” అని మనస్ఫూర్తిగా చెప్పేడు వాడితో. బ్రహ్మరాక్షసుడిక్కూడా కళ్ళెంట నీళ్ళొచ్చాయి దాసరి సత్యదీక్షకి! దాసరి పుణ్యము ధారపోయ్యమని కోరాడు. అందుకు ఏమాత్రం సుముఖత చూపించలేదు దాసరి. “ఇలాటి శరీరాలు ఎన్నో వస్తాయి, పోతాయి. హరి నామ సంకీర్తనం ఎప్పుడో గాని చేసేది కాదు. కనక ఒక్క త్రుటి కాలం ఫలాన్ని కూడ మరొకరికి ఇవ్వను” అని అన్నాడు దాసరి.

రాక్షసుడు కాళ్ళావేళ్ళా పడ్డాడు. తన గురువుగారు అయోగ్యులకి ఎవరికీ చెప్పొద్దని శాశించినా కూడా వైష్ణవ గురువు లక్ష్మణ యోగీంద్రుడు ఎలా అందరికీ గీతా చరమార్థాన్ని శ్రీరంగనాథుడి గుడి గోపురం ఎక్కి మరీ బోధించాడో గుర్తుచేసేడు. ఇంకా ఎంతో మంది వైష్ణవ భక్తులు

చేసిన లోకహితాలైన పనుల్ని ఏకరువు పెట్టేడు. చివరికి దాసరి ఆరోజు పాడిన చిట్టచివరి పాట ఫలాన్నైనా ఇమ్మని వేడుకున్నాడు. కొంత మెత్తబడ్డాడు దాసరి. బ్రహ్మరాక్షసుడిగా ఎందుకు మారేడో చెప్పమన్నాడా రాక్షసుణ్ణి. తన కథ చెబుతాడు రాక్షసుడు.

అంతా విన్న దాసరి ప్రసన్నుడయేడు. "దేని ఫలం ఏమిటో నాకేమీ తెలీదు; అన్నిటినీ చూసుకునే వాడు ఆ నారాయణుడొక్కడే" అని దాసరి అంటూండగా అతని మాటలు అతని నోట్లో ఉండగానే బ్రహ్మరాక్షసుడి రూపం మారిపోసాగింది. సోమశర్మగా, వైష్ణవ చిహ్నాలు ధరించి నిలిచేడు ఎదురుగా. దాసరిని స్తోత్రం చేసి పూజించేడు. ఇలా మాలదాసరి వృత్తాంతం విష్ణుచిత్తుడికి చెప్పేడు శ్రీ మహావిష్ణువు. చెప్పి, "నాకు చేసే భజనల ప్రభావం ఎంత విలువైందో ఇప్పుడు తెలిసింది కదా! కనుక నీ కూతురు ఎప్పుడూ ద్రావిడప్రబంధాలు పాడుతున్నందుకు నువ్వు ఆనందించాలి. ఆమె పూర్వజన్మలో భూదేవి. ఆమెని శ్రీరంగానికి తీసుకెళ్ళు. మేలు జరుగుతుంది" అని ఆనతిచ్చేడు. అలాగే నని శ్రీరంగం వెళ్ళేడు విష్ణుచిత్తుడు గోదాదేవితో. ఇద్దరూ శ్రీరంగేశుడి సన్నిధికి వెళ్ళి ఆయన్ని భక్తితో పూజించేరు. శ్రీరంగనాథుడు ప్రత్యక్షమయేడు. అతని కుశలమడిగేడు. గోదాదేవిని గమనించేడు. ఆమెని తన అంతఃపురంలోకి తీసుకుని ఆమెలాటి మాయాసుందరిని సృష్టించి విష్ణుచిత్తుడితో పంపేడు.

విష్ణుచిత్తుడు పరమానంద భరితుడై అందుకు అంగీకరించాడు. శ్రీ విలిబుత్తూరులో విష్ణుచిత్తుడి ఇంట్లో సకల దేవతల సమక్షంలో మహావైభవంగా జరిగింది వివాహం. సంతుష్టుడై, ఆనందంగా గోదాదేవీ సహితుడై జగాల్ని పాలిస్తున్నాడా నారాయణుడు!

ఈ ప్రబంధంలో రాజనీతి ముఖ్యముగా కనిపిస్తుంది. ఈ నీతులు మనకు మరే ఇతర గ్రంథాలలో కనపడవు. ఇది రాయలు రాసినది కాబట్టి, ఆయన పాటించిన నీతులు ఇందు గ్రంథస్తం చేసాడని అనుకోవచ్చు. ఆలా యామునుడు ద్వారా చెప్పిన రాజనీతులు కొన్ని.

విసుక్కోకుండా ప్రజల్ని రక్షించాలి రాజు. రాజు ప్రజల మేలు కోరితేనే ప్రజలు రాజు మేలు కోరుతారు. ప్రజలంతా కోరిన కోర్కెని పరమేశ్వరుడు తీరుస్తాడు. ఎవడినైనా ముందు పెద్దవాణ్ణి చేసి ఆ తర్వాత తగ్గిస్తే వాడు మొదట్లో ఉన్న తన తక్కువ స్థితిని తల్చుకోడు ఉన్నతస్థితి నుంచి కింద పడ్డాననే బాధపడతాడు. కాబట్టి శీలవంతులైన వాళ్ళని గుర్తించి వాళ్ళని క్రమక్రమంగా వృద్ధిలోకి తీసుకురావాలి. జాతిభ్రష్టులైన బ్రాహ్మణుల్ని దగ్గరికి రానియ్యవద్దు. ఐతే మంత్రుల్గుగా ఉండాల్సిన బ్రాహ్మణులు ఎలాటి వారంటే వయసు ఏభైకి పైన, డెబ్బైకి లోపల వుండాలి; బాగా చదివిన వాళ్ళు కావాలి; అధర్మభీతి, రాజనీతి తెలియాలి; వాళ్ళ పూర్వులెవరూ రోగిష్టులై వుండకూడదు. ఈ గుణాలున్న వాళ్ళు దొరక్కపోతే తనే స్వయంగా రాజనీతి నడపాలి తప్ప ఎవర్ని బడితే వాళ్ళని మంత్రులు చెయ్యకూడదు.

డబ్బు వల్లే ఏ పనీ కాదు. పనిచేసే వాళ్ళకి దాని మీద ఆసక్తి, రాజు మీద విశ్వాసం ఉండాలి. అలాటివాళ్ళ విషయంలో రాజు కూడ లోభించకుండా డబ్బివ్వాలి, దాపరికం లేకుండా ఉండాలి. డబ్బు వసూలు, దేవాలయాధికారము ఒక్కడికే ఇవ్వొద్దు డబ్బు సరిగా రాకపోతే ఆలయాల ఖర్చు తగ్గిస్తాడు; ఆలయాల సొమ్ము తినబోయేడా, రాజుకొచ్చే డబ్బుతో కూడ అది కలుస్తుంది గనక రాజు కూడ వాడి పాపంలో పాలుపంచుకోవలసొస్తుంది. రైతు ముందుగా పొలాన్ని స్వాధీనం చేసుకుని, తర్వాత దాని చుట్టూ ముళ్ళకంచె నాటి, దుక్కి దున్నే ముందు గడ్డల్ని వేర్లను ఏరేస్తాడు. రాజు తన రాజ్యాన్ని కూడ అలాగే చూసుకోవాలి. ఎవడన్నా అబద్ధాలు చెప్తున్నాడని అనుమానం వస్తే వెంటనే వాణ్ణి ఏమీ చెయ్యొద్దు. జాగ్రత్తగా వాడి విషయం అంతా ఆలోచించి నిజంగానే అబద్ధాలు చెప్తున్నాడని నిశ్చయం చేసుకో. అప్పుడైనా వాణ్ణి పన్లోంచి తీసెయ్యొద్దు నీకు దూరంగా ఉండేట్టు చూడు. బోయలు, చెంచులు మొదలైన వాళ్ళు వాళ్ళకి పాలన్నం పెట్టినంత మాత్రాన

విశ్వాసవంతులౌతారు. ఐతే వాళ్ళకి కోపం రావటం కూడ చాలా తేలికే. వాళ్ళ విషయంలో మంచితనంతో ఉండాలి. గట్టివాడొకడు ఒక పని సాధించటానికి మార్గం కనుక్కొని చెప్తే, వాడంటే ఈర్ష్య ఉన్న మరొకడు దానికి వ్యతిరేకంగా చెప్తాడు. అక్కడ ఎవరి వైపూ వెళ్లకుండా, ఆ తర్వాత మాత్రం మొదటివాడు చెప్పినట్టు చెయ్యి. చెడ్డమంత్రులు చాలా విధాల ప్రమాదాలు కలిగిస్తారు. వాళ్ళ సంగతి చూడటానికి గట్టివాణ్ణి, మంచివాణ్ణి వాళ్ళ మీద నియోగిస్తే వాడే వాళ్ళ విషయం చూస్తాడు. అధికారులు ఎప్పుడూ రాజుకు మిత్రులు కారు; వాళ్ళ రాబడి వాళ్ళు చూసుకునే వాళ్ళే. చెడ్డపనులు చేసే అధికారుల్ని పూర్తిగా వదిలెయ్యకుండా అతిజాగ్రత్తగా నడిపిస్తుండాలి. నువ్వు కష్టాల్లో ఉన్నప్పుడు ఎవడు నీకు అపకారం చెయ్యబోతాడో వాణ్ణి ఆ కష్టం తీరేక హింసించవద్దు వాడి ఆస్తి తీసుకో; దాంతో వాడి మదమూ తగ్గుతుంది, నువ్వు హింసించకుండా వొదిలిపెట్టినందుకు వాడు నీకు కృతజ్ఞుడుగానూ ఉంటాడు.

ఎంత చిన్న చోటులోనైనా వ్యవసాయానికి నీళ్ళ వసతులు కలిగించాలి రాజు. దానివల్ల పంటలు పెరిగి పన్ను వసూళ్ళూ ఎక్కువౌతయి. అలాగే పేదల దగ్గర పన్నులు తక్కువ తీసుకుని, వాళ్ళు వృద్ధిలోకి వచ్చేట్టు చూస్తే తర్వాత వాళ్ళ నుంచి కూడా మంచి ఆదాయమే వస్తుంది. అందుకని ఇళ్ళు, భూములు, పశువులు వదిలేసి వెళ్ళబోయే వాళ్ళని ఆదుకుని వాళ్ళు నిలదొక్కుకునేట్టు చెయ్యాలి. రాజు తన ఆదాయంలో సగం సైన్యం కోసం, తనని గెలిపించిన సైన్యం భరణం కోసం వాడాలి; మిగిలిన దాన్లో సగం దానాలకీ భోగాలకీ, మిగతా సగం బొక్కసాన్ని నింపటానికి వాడాలి. చారుల ద్వారా మంత్రుల్ని, శత్రువుల్ని కనిపెట్టి వుండాలి. రాజ్యంలో దొంగల భయం లేకుండా చెయ్యాలి. ఒక దొంగ పట్టుబడితే వాణ్ణి వెంటనే శిక్షించాలి. ఆలస్యం చేస్తే వాడు తప్పించుకుని పోవచ్చు. అలా జరిగితే వాడిక్కాని, మిగిలిన వాళ్ళకి గాని రాజంటే భయం ఉండదు. ఎప్పుడూ నీతిమార్గంలో నడవాలి రాజు. తను తెలుసుకోవలసిన విషయాలు వీలైనంతగా స్వయంగా తెలుసుకుని ఉండాలి. తెలియని కొద్ది వాటికి ఆప్తుల్ని, మిత్రుల్ని అడగాలి. తెలియని విషయాల్లో తన అభిప్రాయమే ఒప్పునుకోకూడదు.

నీ దేశం ఎల్లల్లో ఉన్న అడవుల్ని వృద్ధి చెయ్యి. మధ్యలో ఉన్నవాటిని నరికించు లేకపోతే దొంగలు చేరతారక్కడ. మన్నెం జనం చాలా తప్పులు చేస్తారు. దండించి వాళ్ళని మార్చలేవు. బహుమానాలిచ్చి, నిజం తప్పకుండా మెలిగి, వాళ్ళతో స్నేహం చెయ్యి. నీ యుద్ధాల్లో బాగా సహాయపడతారు వాళ్ళు. ఏనుగులు, మంచి గుర్రాలు దిగుమతి చేసే వర్తకుల్ని అన్ని సౌకర్యాలిచ్చి నీవాళ్ళుగా చేసుకో. వాళ్ళు వాటిని నీ శత్రువులకి చేర్చకుండా పనికొస్తుంది. ఇతర రాజ్యాల రాయబారుల్తో సరస సంభాషణలు చెయ్యాలి. వాళ్ళ ముందు తన అనుచరులు ఇదివరకు ఆ రాజులు చేసిన అపకారాల గురించి మాట్టాడేట్టు చేసి, తను ఆ రాజుకి మిత్రుడిలా నటిస్తూ సర్ది చెప్పాలి.

రాజు తన రాజ్యాన్ని ఎలా కాపాడుకుంటాడో అలాగే తన శరీరాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. రాజు దినచర్య ఇలా ఉండాలి: పొద్దున్నే వైద్యులు, జోస్యులు అతన్ని కలవాలి; జాము పొద్దు తర్వాత డబ్బు విషయాలు కనుక్కోవాలి; ఆ తర్వాత వ్యాయామం, వంటవాళ్ళకి ఆజ్ఞలు; మధ్యాన్నం దేవతార్చన, ధర్మగోష్ఠి; భోజనం అయాక ముందు విదూషకుడు, తర్వాత పౌరాణికులు, కవుల్తో గోష్ఠి; సందెవేళ చారుల్తో ముచ్చట్లు, గానసభ; రాత్రికి ప్రేయసితో సల్లాపాలు, సుఖనిద్ర. (ఇది రాయలు పాటించిన దినచర్య కూడా)

నీ సేవకుల్లో మూడు రకాల వాళ్ళుంటారు ఎప్పుడూ నీ మంచి కోరేవాళ్ళు, మంచిచెడ్డలు రెండూ కోరేవాళ్ళు, చెడే కోరేవాళ్ళు. ఎవరు ఎవరో గ్రహించాలి నువ్వు. నీకు ఎవడైనా బాగా నచ్చితే, అన్ని విషయాలు తెలుసుకుని నిశ్చయించుకుని, ఒక్కసారిగా హఠాత్తుగా అతను ఆశించలేనంత డబ్బిచ్చి ఆశ్చర్యపరుచు. చారుడు రాజు ఊరివాడై ఉండాలి, నానా భాషలు తెలిసినవాడు, ఇతర చారులెవరో తెలీని వాడు, మిగిలిన చారులకి తను తెలియని వాడు కావాలి. రాజు భోజనంలో రకరకాల పదార్థాలు ఉంటాయి గనక బాగా ఆకలిగా ఉంటే తప్ప

తినకూడదు. రాజ్యం చేసేప్పుడు ఎన్నో పాపాలు కట్టుకోకతప్పదు. వీలైనంత అధర్మం జరక్కుండా చూసుకోవటం అవసరం. నీ ధర్మం నువ్వు నిర్వర్తించు" వంటి నీతులను వివరించారు. ఇవి రాయలు పాటించి చూపినవి. ఇంత సవివరముగా మనకు మరే గ్రంధములో రాజనీతి వివరములు వుండవు. రాజకవిగా కృష్ణరాయులు అద్భుత రచనాశైలికి ఇవి తార్కాణాలుగా నిలుస్తాయి.

నిఖిల భోగాలను అనుభవించిన సాహితి సమరాంగణ చక్రవర్తిగా, తెలుగు సాహిత్యంలో ప్రబంధం యుగం నిలిపి, అత్యంత ఉన్నతమైన స్థితినిచ్చిన మహారాజుగా, నభూతో నభవిశ్యత్తు గా పరిపాలించిన కృష్ణరాయల తెలుగు సాహిత్యంలోనే కాదు, తెలుగు ప్రజల హృదయాలలో కూడా సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు.

రిఫెరెన్సు : సమగ్ర ఆంధ్ర సాహిత్యం – ఆరుద్ర
కృష్ణరాయల – ఆముక్త మాల్యద – కె. వి. రామారావు
ఆముక్తమాల్యద కర్త కృష్ణరాయడే – చిలుకూరి నారాయణరావు

COMMENTS